# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026




## కన్నులపండువగా భాగ్ సవారి ఉత్సవం

తిరుమల,సెప్టెంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:

వేంకటేశ్వరస్వామికి సంవత్సరంలో నిర్వహించే ఉత్సవాలలో భాగ్ సవారి ఉత్సవం గురువారం సాయంత్రం వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన మరుసటిరోజు "భాగ్ సవారి" ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. స్వామివారి భక్తాగ్రేసరుడైన అనంతాళ్వారుల భక్తిని పరీక్షి ంచడానికి శ్రీదేవి సమేతంగా స్వామివారు అనంతాళ్వారు పూదోటకు మానవ రూపంలో విచ్చేస్తారు. తన పూదోటలో పూలు కోస్తున్న అమ్మవారిని అనంతాళ్వారువారు అశ్వత్త వృక్షానికి బంధిస్తాడు. స్వామివారిని పట్టుకోబోగా అప్రదక్షణ దిశలో పారిపోయి ఆలయంలో ప్రవేశించి మాయమైపోతారు. అమ్మవారిని బంధీనుండి విముక్తురాలుని చేసి, పూల బుట్టలో కూర్చోబెట్టి స్వయంగా స్వామివారి చెంతకు చేరవేస్తాడు. అతని కోరిక మేరకు బ్రహ్మోత్సవాల మరునాడు తాను అనంతాళ్వారుల తోటలోనికి అప్రదక్షణంగా విచ్చేసి తిరిగి ఆలయంలోనికి ప్రవేశిస్తానని అభయమిచ్చాడు. వైభవోత్సవ మండపం నుండి బయలుదేరి అప్రదక్షి ణంగా అనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలందుకొని తిరిగి ఆలయంలోనికి ప్రవేశించడంతో ఈ కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చినజీయర్ స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్, పేష్కార్ రామ కృష్ణ, అర్చకులు

అధికార నందివాహనంపై

# శివపుత్రుడు



కాణిపాకం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సిద్ధి,బుద్ధి సమేతుడైన గణనాధుడు గురువారం అధికార నందివాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో శనివారం జరిగిన అధికార నందివాహన సేవతో ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి కాణిపాకం వళ్ళువర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించారు. అలాగే రాత్రి సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి శాస్రోక్తంగా పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యాలను సమర్పించారు. అనంతరం రంగురంగుల విద్యుద్ధీపాలు, వివిధ రకాల పరిమళ పుష్పాలతో దేధీప్యమానంగా అలంకరించిన అధికార నందివాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# చిత్తూరు తెరపైకి 'కుల' రాజకీయం

- మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధికి బిసీ, బలిజ కులాల మధ్య చిచ్చుకు యత్నం
- బిసీలను అణగదొక్కడానికి వైకాపా ప్రయత్నిస్తోందని ఎమ్మెల్యే ఆరోపణ
- తెలుగుదేశంలో బలిజలకు అన్యాయం జరుగుతోందని వైకాపా బలిజ నేతలు ధ్వజం

చిత్తూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

జరుగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు కులాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందడానికి వ్యూహాలు రచించి అమలుకు సిద్ధం అవుతున్నాయి. ఇప్పటి వరకు స్తబ్దుగా వున్న చిత్తూరులో కులాల మధ్య రచ్చ పెట్టి ఆ కులస్తులకు సంబంధించిన ఓట్లను గంపగుత్తగా ఒకే పార్టీకి వేయించుకునే విధంగా ఇరు పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు వద్ద పిఎగా విధులు నిర్వహిస్తున్న కుమారస్వామి అక్రమ క్వారీ నిర్వహిస్తూ లక్షలు దోచుకుంటున్నారని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి రెండు రోజుల క్రితం ఆరోపించగా, ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు తన పిఎ కుమారస్వామి బిసీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అతనిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఎంసి విజయానందరెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొనడంతో తెలుగుదేశం పార్టీ బిసీల మధ్య చిచ్చు పెట్టి మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి సిద్ధం అయ్యింది. ఈ క్రమంలో ఈ వ్యవహారంపై ఇటు వైకాపాలోని బిసీ నేతలు, అటు తెలుగుదేశం పార్టీలోని బిసీ నాయకులు పల ప్రకటనలు చేస్తూ చిత్తూరు నగర పరిధిలోని బిసీల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. ఇదిలా వుండగా గుడిపాల మండలానికి చెందిన వైకాపా నాయకులు మధుసూధన్‌రాయల్ చిత్తూరులో అధికార తెలుగుదేశం పార్టీ బలిజలకు తీరని అన్యాయం చేస్తోందని, అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయం కోసం బలిజ నాయకులను ఉపయోగించుకొని ఆపై ప్రక్కన పెట్టిందని ఆరోపించారు. ఇటీవల సిఎం నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి పనులకు సంబంధించి వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఈ శంకుస్థాపనలు జరిగాయి. అయితే ఈ శంకుస్థాపన శిలాఫలకాల్లో బలిజ సామాజిక వర్గానికి చెందిన డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్ పేరు పెట్టలేదని, అలాగే మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి నారాయణ ఫోటోను సైతం ముద్రించ లేదని ఆరోపించారు. చిత్తూరులో అధికారంలో వున్న సామాజిక వర్గానికి చెందిన నాయకులు బలిజ నాయకులకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంపై తెలుగుదేశం పార్టీలో వున్న బలిజ సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఖండించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు అత్యధికంగా వుండటంతో ప్రస్తుతం జరుగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలిజ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మేయర్ అభ్యర్థిత్వం ఖరారు చేయాలని భావిస్తోంది. ఇదే సమయంలో ప్రతిపక్ష వైకాపా సైతం బలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలపాలని వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వ హయాంలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో బలిజ సామాజిక వర్గానికి చెందిన డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్, మున్సిపల్ శాఖ మంత్రి అయిన నారాయణ పేర్లు శిలాఫలకంలో లేకపోవడం, ఈ విషయంను వైకాపా విస్తృతంగా ప్రచారం చేయడంతో మున్సిపల్ ఎన్నికల్లో బలిజలు వైకాపా వైపు మొగ్గ చూపే అవకాశం వుంటుందని వైకాపా ఆశించి ఈ మేరకు ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి ఎక్కడా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పిఎ కులంను ప్రస్తావించకపోయినప్పటికీ జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బిసీల ఓట్లు తెలుగుదేశం అభ్యర్థికి పడేలా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి బిసీ కులానికి చెందిన తన పిఎపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని వ్యూహాత్మకంగా తెరపైకి తీసుకువచ్చారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కులాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నాలు జరుగడంతో ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో ఇటు అధికార తెలుగుదేశం, అటు ప్రతిపక్ష వైకాపాలు హోరా హోరీ పోరుకు సిద్ధం అవుతున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు.





# రైతుబజార్‌లో కంపు కంపు!

- అధికారుల నిర్లక్ష్యం, వ్యాపారుల దోపిడీ బహిర్గతం
- రాయలచెరువు రోడ్డులో ప్రజలకు నరకయాతన
- పట్టిక ధరలు పక్కనపెట్టి మోసం చేస్తున్న వ్యాపారులు

తిరుపతి రూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :

స్థానిక రాయలచెరువు రోడ్డులోని తిరుపతి రైతు బజార్‌లో పరిస్థితులు అదుపుతప్పుతున్నాయి. పారిశుద్ధ్యం పూర్తిగా గాలికొదిలేసి.. ధరల నియంత్రణను పక్కనబెట్టి అధికారులు చూస్తూ ఊరుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఒకవైపు చెత్తాచెదారాలు, కుళ్లిపోయిన కూరగాయల గుట్టలతో బజార్ దుర్వాసనలో మునిగిపోతుంటే.. మరోవైపు వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి వినియోగదారులను దోచుకుంటున్న పరిస్థితి నెలకొంది. బజార్‌లో ఎక్కడ చూసినా పాడైపోయిన కూరగాయల కుప్పలు, ఎత్తుకు పెరిగిన చెత్త గుట్టలు కనిపిస్తున్నాయి. శుభ్రతపై కనీస పర్యవేక్షణ లేకపోవడంతో దుర్గంధం ఊపిరి తీసుకోనీయని స్థాయికి చేరింది. కొనుగోలుదారులు బజార్‌కు అడుగుపెట్టగానే ముక్కు మూసుకుని తిరిగి వెళ్తున్న దుస్థితి ఏర్పడింది. ఇది రైతు బజారా.. చెత్త డంపింగ్ యార్డా?" అని ప్రజలు మండిపడుతున్నారు. ఇక ధరల విషయంలో జరుగుతున్న దందా మరింత ఆందోళన కలిగిస్తోంది. బజార్‌లో ప్రదర్శిస్తున్న ధరల పట్టిక ఒకటి.. వాస్తవంగా విక్రయించే ధరలు మరోటి. ప్రతీ కూరగాయపై అధిక ధరలు వేసి వినియోగదారుల జేబులను ఖాళీ చేస్తున్నారని కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థనే వ్యాపారులు బహిరంగంగా ధిక్కరిస్తుండటం గమనార్హం. ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపా రులు రెచ్చిపోతున్నారని, సాధారణ ప్రజలే బలవుతున్నారని విమర్శిస్తున్నారు. రైతు బజార్‌ను తక్షణమే ప్రక్షాళన చేసి, పారిశుధ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ధరల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రజా ఆగ్రహం ఉప్పొంగడం ఖాయమని హెచ్చరిస్తున్నారు.

ఉపాధ్యాయుడి సొంత వైద్యం..

# విద్యార్థులు ఆస్పత్రి పాలు

- వేపాకు..జీలకర్ర ఇచ్చిన టీచర్..
ఆపై ఆశవర్కర్‌చే ఐరన్ మాత్రలు !!



బైరెడ్డిపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఇచ్చిన సొంత వైద్యం ఆపై ఐరన్ మాత్రలు తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన సంఘటన మండలంలోని చిక్కనపల్లి పాఠశాలలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన మేరకు వివరాలిలా.. పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు రోజూ పిల్లలకు కోడిగుడ్లు తినొద్దని వేపాకు, జీలకర్ర తినాలని ఇచ్చేవాడని గురువారం సైతం ఈ విధంగా సుమారు ఏడుమంది పిల్లలకు వేపాకు, జీలకర్ర ఇచ్చాడన్నారు. దీంతో పాటు మధ్యాహ్నం విద్యార్థులకు ఆశ వర్కర్ ఐరన్ మాత్రలు కూడా ఇవ్వడంతో విద్యార్థులకు ఒక్కసారిగా వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఈ విషయంగా ఎంఇఒ 2 దేశమ్మకు సమాచారం అందడంతో ఆమె 108 సాయంతో పిల్లలను బైరెడ్డిపల్లి పిహెచ్‌సికి తరలించారు. ఉపాధ్యాయుడి తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంఇఒకు ఫిర్యాదు చేయగా ఆమె విషయాన్ని డిఇఒ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం పిల్లలు కోలుకుంటున్నట్లు తెలిసింది. కాగా ఉపాధ్యాయుడు పిల్లలకు కడుపునొప్పి అంటే తాను వేపాకు, జీలకర్ర మజ్జిగలో కలిపి ఇచ్చినట్లు పేర్కొనడం గమనార్హం. ఏ కారణం చేత విద్యార్థులకు వేపాకు, జీలకర్రను ఉపాధ్యాయుడు తినిపించాడో ఉన్నతాధికారులు విచారించాల్సి ఉంది. పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ పిల్లలకు కడుపుతల్లి వస్తే తమకు తెలియజేయాలే గానీ ఉపాధ్యాయుడు ఎలా వేపాకు, జీలక ర్ర ఇస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఇఒ 2 దేశమ్మను 'ప్రభాతవార్త' గురువారంరాత్రి వివరణకోరగా విద్యార్థులు అస్వస్థతకుగురైన మాటవాస్తవమేనన్నారు. పూర్తి విషయాలు శుక్రవారం తెలియజేస్తామని ఫోన్‌లో తెలిపారు.

## 31వ సిఐఐపై సీఎం వీడియో కాన్ఫరెన్స్

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :




అమరావతిలోని రాష్ట్ర సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి 31వ సీఐఐ-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్య సదస్సు-2026 సన్నద్ధత, పెట్టుబడుల ప్రోత్సాహం, పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, హెచ్ఓడీలతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ మిని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 31వ సీఐఐ-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్య సదస్సు-2026ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాల వారీగా చేపడుతున్న సన్నాహకాలు, శాఖల మధ్య సమన్వయం, పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షి ంచారు. అలాగే ఎస్ఐపిబి ఆమోదించిన పారిశ్రామిక ప్రాజెక్టుల గ్రౌండింగ్ స్థితి, భూమి కేటాయింపు, అవసరమైన అనుమతులు, మౌలిక వసతుల కల్పన, ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సమీక్షి ంచారు. పిపి2026 పెట్టుబడి ప్రతిపాదనల పురోగతి, ప్రాజెక్టుల స్థితిగతులు, పెండింగ్ అనుమతులు, పెట్టుబడి దారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కూడా ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పెట్టుబడుల ప్రాజెక్టుల అమలులో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారుల మధ్య సమన్వయం, శాంతిభద్రతలు, పెట్టుబడిదారులకు అవసరమైన ప్రభుత్వ సహకారం తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షి ంచారు. సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్ర రెడ్డి,

## పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయండి...

..స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్...

తిరుపతి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా తిరుపతి నగరంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధ్యక్షతన గురువారం 45 వ స్మార్ట్ సిటీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం జరిగింది. స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. ఈ సమావేశంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. బోర్డు సమావేశంలో కలెక్టర్, ఎస్పీ సుబ్బరాయుడు, తుడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్, గోవిందరావు, ఇంజనీర్‌ఇన్‌చీఫ్ ప్రభాకర్ రావు, అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ప్రొఫెసర్ బి.రామచంద్ర రెడ్డి, ప్రొఫెసర్ టి.రమాశ్రీ, కార్పొరేషన్ ఎగ్జామినర్ అకౌంట్స్ రామచంద్ర రెడ్డి, ఎస్.ఇ. శ్యాంసుందర్, ఈఈ రవి, జీఎం చంద్రమోళి, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల రెండో ఘాటురోడ్‌లో చిరుత సంచారం

తిరుపతి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

తిరుమల రెండో ఘాటురోడ్ లో చిరుత పులి సంచారం తీవ్ర భయాందోళన రేపింది. వినాయక ఆలయాన్ని దాటిన కిలోమీటరు దూరంలో రహదారి పక్కన చిరుత సంచరిస్తుండటాన్ని వాహనదారులు గమనించి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఘాట్ రోడ్డు మార్గంలో ప్రయాణించే భక్తులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



# ఆచారాలకు అపచారం...

**సంప్రదాయాలను చెప్పలేని ప్రధానార్చకులు -పవిత్రోత్సవాల్లోనే తప్పిదాలు**

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:

ఆలయాల్లో,ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఏడాది పొడవునా జరిగిన తెలిసి తెలియక తప్పిదాల నివృత్తి కోసం ప్రతి ఏడాది 'పవిత్రోత్సవాలను' ఐదు రోజుల పాటు శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 22 నుంచి పవిత్రోత్సవాలు సంద్రాయ బద్ధంగా జరుగుతున్నాయి. మొదటి రోజు కార్యక్రమాలకు ఆలయ చైర్మెన్, ఇఓ ఇద్దరు గైరు హాజరు. అయితే పవిత్రోత్సవాల సందర్భంగా ఆచరించాల్సిన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలకు సంబంధించి నాయకులకు వివరించాల్సిన బాధ్యత 'ప్రధానార్చకుల మీద ఉంది'. అయితే ఆయన ముందే ఆయన వద్దే పవిత్రమైన కాసుల పేరును పెట్టిన తట్టను ఆలయ ఇఓ పట్టుకోవటం, అందులోని కాసుల పేరును, రుద్రాక్ష మాలను ఓ బోర్డు సభ్యుడు ముట్టుకోవటం గమనిస్తే ఇక్కడ ఆచారాలకు ఎంతటి అపచారం జరుగుతుందో అర్థమౌతుంది. ఇక్కడి ఆచార వ్యవహారాలను చెప్పె పరిస్థితిలో ప్రధానార్చకులు లేకపోవటం చర్చనీయాంశంగా మారింది.

### పవిత్రోత్సవాలు ఎందుకు జరుపుతారు?:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాలు ఎందుకు జరుపుతారనే విషయం బోర్డు సభ్యులు, చైర్మెన్, ఆలయ ఇఓ ఇతరసిబ్బంది తెలుసుకోవాల్సి ఉంది. వారు తెలుసుకోనపుడు ఆచార వ్యవహారాలను ప్రధానార్చకులు తెలియజేయాలి. జరిగిన తప్పిదాలకు సంబంధించి నివృత్తికి చేసే పూజల్లో కూడా అపచారం చోటు చేసుకుంటే ఎలా అనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు, స్వామి అమ్మవార్ల ఏడు వారాల నగల్లో కొన్ని ప్రధానమైనవి కాసులపేరు, రుద్రాక్ష మాల,కమండలం, పాదుకలు,దండకంను ఎవరు తీసుకురావాలి? ఎవరు తాకాలి అనే విషయాన్ని ప్రధానార్చకులు వివరించాలి. అయితే ఇటీవల వరకు ఆలయంలో ప్రధానార్చకులుగా పని చేసిన ప్రధానార్చకులు ఒకరు సరాసరి ఓ బయటి మహిళకు తట్ట ఇవ్వటం గమనిస్తే ఇక్కడ ఆచారాల అమలులో ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుంది. ఇక్కడ పవిత్రమైన వాటిని కేవలం అర్చకులు, అభిషేక గురుకుల్స్,పూజల్లో పాల్గొనే అర్చకులు మాత్రమే తాకవచ్చు. ఇక్కడ పవిత్రోత్సవాలను కాంచీ పురం లో తయారు చేయిస్తారు. ప్రతిరోజూ ఆలయం లోపల ఉత్సవంగా పవిత్రాలను యాగశాలకు చేర్చుతారు. తట్టల్లో పవిత్రమైన ఆభరణాలను పెడతారు. వాటిని అర్చకులు,అభిషేక గురుకుల్స్ తెచ్చి యాగశా లలో పూజలు చేసి స్వామి అమ్మవార్లకు అలంకరింపజేస్తారు. ఈ నేపథ్యంలో కాసుల పేరు,రుద్రాక్షమాలను మఖమల్ గుడ్డపై పెట్టి తట్టలో ఊరేగించారు. యాగశాల వద్ద ప్రదానార్చకులకు అందించే క్రమంలో తట్టను ఇఓ తీసుకురాగా ప్రధానార్చకుల వద్ద అందించే క్రమంలో ఓ బోర్డు సభ్యుడు రుద్రాక్షమాలను,కాసుల పేరును రెండు చేతులతో తాకటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అక్కడ ప్రధానార్చకులు ఆచారాలను వివరించాల్సి ఉంది. కానీ ఎందుకు మౌనం వహించారో? ఆచార వ్యవహారాలను వివరించ లేని ప్రధానార్చక పదవి ఎందుకో? అని పరిశీలకులు చర్చించు కుంటున్నారు. ఇకనైనా ప్రధానార్చకులు స్థానిక ఆచార వ్యహారా లను, సంప్రదాయాలను కాపాడాలని ధార్మికవాదులు కోరుతున్నారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన




శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి డిపో గ్యారేజ్ ఆవరణలో గురువారం అత్యుత్తమ సేవలు అందించిన కండక్టర్లు, డ్రైవర్లను డిపో మేనేజర్ ఎం. రేవతి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యధిక ఈపీకే సాధించిన డ్రైవర్లు కె.ఎం. మణి ఎస్/ఎల్ సర్వీస్ లో ఈపీకే 46.88, జి.ఎస్. మన్యం తిరుమల సర్వీస్ నందు హై ఈపీకే 87.82 ,పి. బాలాజీ మెట్రో సర్వీస్ నందు ఈపీకే 73.61 అదేవిధంగా అత్యధిక ఈపీకే సాధించిన కండక్టర్లు ఎస్. కుప్పయ్య హై ఈపీకే 69.13 పి. సరస్వతి హై ఈపీకే 47.98,కె.ఎం.ఆర్. రెడ్డి హై ఈపీకే 47.09 డీజిల్ ఆదా చేసిన వారు వి.బి. రాముడు 118 లీటర్లు, టి. మధు 105 లీటర్లు ఆదా చేశారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పనిచేసి ఎక్కువ ఆదాయం తీసుకువచ్చి డిపోకి మంచి పేరు తీసుకురావాలని డిపో మేనేజర్ రేవతి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ఏ ఏసీ చక్రవర్తి, సూపరింటెండెంట్ ఎం. మారయ్య, యూనియన్ నాయకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లంపల్లిలో ఆపరేషన్ త్రిశూల్



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ఎల్లం పల్లి గిరిజన కాలనీలో గురువారం ఆపరేషన్ త్రిశూల్‌ను పోలీసులు నిర్వహించారు. మారుమూల గిరిజన కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించుటకు రూరల్ సిఐ ఇబ్రహీం సారధ్యంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు యువత,గ్రామ ప్రజలకు భద్రతకు సంబంబధించి వివరించారు. ఈ సందర్భంగా మహిళా భద్రతా చట్టాలతో పాటు అందుబాటులో ఉన్న మహిళా పోలీసు సహాయక చర్యలను వివరించారు. గంజాయి మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రమాణాలు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. దీని వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నా యన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించటం హెల్మెట్ ధరించటం వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగం వల్ల ఇబ్బందులు, మద్యం సేవించి వాహనం నడిపితే కల్లే ఇబ్బందిని వివరించారు. పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

## పొడి చెత్త ఇస్తే లక్కీ డిప్ బహుమతులు

తొట్టంబేడు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రీసైక్లింగ్‌పై అవగాహన పెంచేందుకు పెద్దకన్నాలి గ్రామ పంచాయతీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తొట్టంబేడు ఎంపీడీఓ పి.సురేంద్రనాథ్, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ ఎంపీడీఓ గిరిధర్ రెడ్డి ఆదేశాల మేరకు దసరా పండుగను పురస్కరించుకుని ఖిదసరా ధమాకా ఆఫర్‌ఖి ప్రకటించినట్లు పంచాయతీ కార్యదర్శి భాస్కర్ గురువారం తెలిపారు. ఒక కుటుంబం నుండి 10 కిలోలకు పైగా పొడి చెత్త (డ్రై వేస్ట్) అంటే ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, పేపర్లు, ఇతర పనికిరాని వస్తువులు ఇచ్చిన ప్రతి కుటుంబానికి పంచాయతీ తరపున ఒక లక్కీ డిప్ టోకెన్ ఉచితంగా ఇవ్వనున్నారు. దసరా రోజున టోకెన్లు తీసుకున్న వారందరితో లక్కీ డిప్ తీసి విజేతలను ఎంపిక చేసి ఆకర్షణీయ బహుమతులు అందజేస్తారు. 1వ బహుమతి మిక్సీ గ్రైండర్ 2వ బహుమతి డిన్నర్ సెట్3వ బహుమతి మల్టీ కుక్కర్ / ఎలక్ట్రిక్ కేటిల్ చెత్తను రోడ్లపై వేయకుండా పంచాయతీకి అందించి గ్రామ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని, అదే సమయంలో బహుమతులు గెలుచుకోవాలని కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ధర్నా

### -వైసీపీ తీరుపై టిడిపి నేతల ఆగ్రహం



తిరుపతి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త: తిరుపతిలోని పాత హీరో హోండా షోరూమ్ నుండి చింతలచేను వైపు వెళ్లే అండర్ బ్రిడ్జి 28వ తేదీ ప్రారంభంకానుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ జెబి శ్రీనివాస్ తెలిపారు. అండర్ బ్రిడ్జి పనులు పూర్తవడంతో గురువారం పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ తో కలిసి అండర్ బ్రిడ్జి ని పరిశీలించారు. ఈ సందర్భంగా జెబి శ్రీనివాస్ మాట్లాడుతూ అండర్ బ్రిడ్జిలో వర్షపు నీటిని బయటకు పంపేందుకు మోటార్ ఏర్పాటు చేయాల్సి ఉందని, ఇప్పటికే అధికారులు ఆ పనిని పూర్తి చేస్తున్నారని అన్నారు. మోటార్ ఏర్పాటు ఆలస్యమైనా డీజిల్ మోటార్‌తోనైనా నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వే అధికారులతో చర్చించిన అనంతరం 28వ తేదీ అండర్ బ్రిడ్జి ప్రారంభానికి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అండర్ బ్రిడ్జి ప్రారంభ తేదీ ఇప్పటికే ఖరారైనప్పటికీ వైసీపీ నాయకులు రాజకీయం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గతంలో వైసిపి వేసిన రోడ్లు సమయంలో ఎందుకు అండర్ బ్రిడ్జి లు వేయలేదు, ఎందుకు పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. తిరుపతి నగరంలో అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఇలాంటి క్రెడిట్ చోరి కారణంగా ఇప్పటికే ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారని, కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ, తాతయ్య గుంటగంగమ్మఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, టిడిపి నేతలు వి.పుష్పావతియాదవ్, బ్యాంకు శాంతమ్మ, కృష్ణ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్ యాదవ్, మునిశేఖర్ రాయల్, ఊట్ల సురేంద్ర నాయుడు, యశ్వంత్ రెడ్డి, రుద్రకోటి సదాశివం, ముని రామయ్య, మన్యం శ్రీనివాసులు, ఆర్పీ శ్రీనివాసులు, ఆముదాల తులసీ రామ్, సుబ్బు యాదవ్, ఆనంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటేరులో తాగునీటి సమస్యకు... తాత్కాలిక పరిష్కారం

### - గ్రామ ప్రజలకు ఊరట



తిరుపతి రూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త : చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని గారి సూచనలు మేరకు తిరుపతి రూరల్ ఓటేరు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు సంబంధించి స్థానిక టీడీపీ నాయకులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో తాత్కాలిక పరిష్కారం అందించారు. ఓటేరు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, టీడీపీ సీనియర్ నాయకులు షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో యూనిట్ ఇంచార్జ్ సుదర్శన్ రావు, గ్రామ కమిటీ అధ్యక్షులు మోహన్ కుమార్, కార్యదర్శి రంగయ్య, ఐటీడీపీ అధ్యక్షుడు మీసేవ మనీతో పాటు పంచాయతీ సిబ్బంది కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నీటి సరఫరా వ్యవస్థలో ఉన్న సాంకేతిక లోపాలను సరిచేయడంతో పాటు తాత్కాలికంగా ప్రజలకు తాగునీటి సరఫరా కొనసాగించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామ ప్రజలకు కొంత మేర ఊరట లభించింది. ఈ సమస్యను సత్వరమే గుర్తించి పరిష్కారానికి కృషి చేసినందుకు తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షుడు ఏ. ఈశ్వర్ రెడ్డికి గ్రామ నాయకులు, ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో దీర్ఘకాలికంగా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం మరిన్ని అభివృద్ధి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తే...బంగారు భవిష్యత్తు




బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబర్24 ప్రభాతవార్త: విద్యాభ్యాసనలో విద్యార్థులు నైతిక విలువలతో భవిష్యత్తులో ఎదుగుదల కోసం ఒక ఆశయం నిర్ణయించుకుని పట్టుదలతో కష్టపడితే ఫలితం లభిస్తుందని పట్టుదలతో కృషి చేస్తే బంగారు భవిష్యత్తు లభిస్తుందని శ్రీకాళహస్తి డి.ఎస్.పి నరసింహమూర్తి విద్యార్థులు ఉద్దేశించి ఉపదేశించారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీనివాస్ తేజ ప్రైవేట్ స్కూల్, కాలేజీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు మహిళల భద్రత, చట్టాలపై అవగాహన, డ్రగ్స్, దుష్ప్రభావాలు అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం శ్రీనివాస తేజ స్కూల్, కాలేజీ ప్రిన్సిపల్ చైర్మన్ సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డి.ఎస్.పి నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యా సంస్థలు విద్యార్థుల ఉత్తీర్ణత స్థాయితో పాటు సబ్జెక్టులో అవగాహన కల్పిస్తూ విలువలతో కూడిన నిజాయితీ కలిగిన విద్యను అందిస్తూ ఉన్నత విద్యాభ్యాసం పై ఆసక్తి కల్పించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టాము చదివిస్తున్నాము నేటి విధానమును పక్కన పెట్టి తమ పిల్లలు భవిష్యత్తు కోసం ప్రతినిత్యం వారితో విద్యా విధానంపై, పరిసరాల ప్రభావం, సమాజంలో విషయాలను అవగాహన చేసుకుని ఎలా రాణించాలి వంటి పలు విషయాలపై తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని అప్పుడే తమ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని తెలియజేశారు. నేడు మొబైల్ ఫోన్లు, యూట్యూబ్ ఛానల్ వచ్చిన తర్వాత తల్లిదండ్రులతోపాటు విద్యార్థులు కూడా మొబైల్ ఫోన్లో మోజులో పడి అనవసరమైన విషయాలకి లోబడి తప్పుదోవ పడుతున్నారని దీనికి స్వస్తి పలకవలసిన బాధ్యత తల్లి తండ్రి లదే బాధ్యతని సూచించారు.పరీక్షల్లో లేదా పోటీ పరీక్షల్లో ఆశించిన ఫలితాలు రాకపోయినా నిరాశ చెందకుండా, వైఫల్యాలను విజయానికి మెట్లుగా భావించి ముందుకు సాగాలని సూచించారు. ఏ పరిస్థితుల్లోనూ ఆత్మహత్య వంటి ఆలోచనలకు లోనుకాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు స్నేహితులతో తమ సమస్యలను పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.బి.ఎన్.కండ్రిగ లక్ష్మీనారాయణ, ఎస్.ఐ.బి.ఎన్. కండ్రిగ హరిప్రసాద్, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## సమస్యలు నిరంతరం...పరిష్కారం అవశ్యం



శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజా సమస్యలను యుద్ధ ప్రాతిపదికమీద పరిష్క రిస్తున్నా ఎంఎల్ఏ అందుబాటులో ఉన్నారంటే జనం పోలోమని చేరుకుంటున్నారు. తమ గోడును విన్నవించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం శాసనసభ్యుడు అందుబాటులో ఉన్నారని తెలుసుకున్న ప్రజలు ఆయన క్యాంపు కార్యాలయానికి చేరుకొని తమ సమస్యలను విన్నవించుకున్నారు.ముఖ్యంగా ప్రస్తుతం భూ సమస్యలు, కొత్త పెన్షన్లు గురించి వివరిస్తున్నారు. వచ్చిన ప్రజల సమస్యలను సావధానంగా వింటున్న శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి వెంటనే అధికారులకు చరవాణిద్వారా సమాచారం అందిస్తున్నారు.వవెంటనే సమస్యలు పరిష్కరించి తన దృష్టికి తీసుకు రావాలని సూచిస్తున్నారు.

## భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి

### -ఎంఎల్ఏకు బిజెపి వినతి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న సుబ్రమణ్యం స్వామిగుడి దిగువన ఉన్న మండపం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో దేవస్థానం తరుఫున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని గురువారం బిజెపికి చెందిన గరికపాటి రమేష్‌బాబు శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.పలు అభివృద్ధి కార్యక్రమాలు స్థానికులకు ఉత్సవాల సందర్భంగానే కాకుండా సాధారణ సమయాల్లో చిన్న చిన్న కార్యక్రమాలు నిర్వహించుకొనుటకు అనుకూలంగా ఉంటుందని ఎంఎల్ఏకు వివరించారు. కొండ దిగువన ఉన్న ఖాళీ స్థలంలో శాశ్వత రేకుల షెడ్లును నిర్మిస్తే ప్రతి ఏడాది జరిగే ఆడికృత్తిక మహోత్సవాల సందర్భంగా నిర్వహించే కళ్యాణోత్సవంను ప్రత్యేక ఏర్పాట్లు అవసరం లేదన్నారు. షెడ్ నిర్మిస్తే ఎలాంటి ఆందోళన లేకుండా ధార్మిక కార్యక్రమాలకు అవకాశం ఉంటుందన్నారు. కాగా ఆర్‌టిసి బస్టాండు రోడ్డు పాత నెల్లూరుబస్టాండ్‌నుంచి ఆర్‌టిసి వరకు ఉన్న మార్గంలో కొండపైకి వెళ్ళు మార్గంలో ఆర్చి నిర్మిస్తే యాత్రికులు,భక్తులు వెళ్ళటానికి వీలుగా ఉంటుందని వివరించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమాల్లో గరికపాటి రమేష్‌బాబుతో పాటు ఆలయ ఛైర్మెన్ నెమళ్ళూరు బుజ్జి బిజెపి ఓబిసి మోర్చా కన్నా వెంకటేశ్వర్లు, గంగపుత్ర గాంధీ తదితరులు హాజరయ్యారు.

**వినాయక పూజల్లో పాల్గొన్న ఎంఎల్ఏ:**

శ్రీకాళహస్తిలోని కుమారస్వామి కొండ దిగువన ఉన్న వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉత్సవ కమిటి నిర్వహణ కమిటి సభ్యులు వంకాయల సిద్దులయ్య ప్రత్యేకాహ్వానం మేరకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక స్వామి దర్శనం తనకు ఎంతో సంతృప్తి నిచ్చింది.ఈ పవిత్ర పూజలకు భక్తులు విశేష సంఖ్యలో హాజరై పూజలు జరిపించుకున్నారన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబర్ 24: ప్రభాతవార్త: గ్రామాలలో ప్రతి ఒక్కరూ పరిసరాల వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఎటువంటి రోగాలు బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చు అని ఎంపీడీవో వెంకట రత్నమ్మ తెలిపారు గురువారం మండలంలోని పల్లమాల గ్రామంలో స్వచ్ఛ రథం కార్యక్రమంలో ఎంపీడీవో పల్లమాల హైస్కూల్లో పర్యటించి పర్యవేక్షించి అవగాహన కల్పించి పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులచే ప్రమాణం చేయించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పరిసర పరిసరాల పరిశుభ్రతతో భాగంగా తడి పొడి చెత్తలను వేరు చేసి స్వచ్ఛరథం వాహనాలు అందించేందుకు విద్యార్థులు తమ వంతు సహాయంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తడి పొడి చెత్త లను వ్యర్థాలను స్వచ్ఛ రథం కందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## విద్యార్థుల్లో సేవాభావం అవసరం : ప్రిన్సిపాల్

### -ఎస్‌వీఏ కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త: యువతలో సేవాభావం, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఉపయోగపడుతుందని ఎస్‌వీఏ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ అన్నారు. గురువారం జాతీయ సేవా పథక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ వీ ఏ ప్రభుత్వ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ వాణిశ్రీ మాట్లాడుతూ ఎన్ ఎస్ ఎస్ వల్ల విద్యార్థుల్లో సేవాభావం వృద్ధి చెందడంతో పాటు గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య స్పృహ కలుగుతుందని తెలిపారు. ఎన్ఎస్ఎస్ అనేది కేవలం విద్యార్థుల కార్యక్రమం మాత్రమే కాదని, సమాజం పట్ల బాధ్యత కలిగిన మంచి పౌరులను తీర్చిదిద్దే ఉద్యమమని ఎన్ ఎస్ ఎస్ అధికారి డాక్టర్ సుధీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్యం నరసింహులు, ఎన్ ఎస్ ఎస్ అధికారి డాక్టర్ సుధీర్, అధ్యాపకులు డాక్టర్ జి. హెన్నా, ఎన్ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## అందరూ సమతుల ఆహారం తీసుకోవాలి



తొట్టంబేడు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దిగువ సాంబయ్యపాళెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మాసం మన అంగన్వాడీ మన బాధ్యత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరు బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులు సమతుల ఆహారం తీసుకోవాలని, మానసికంగా ఆహ్లాదంగా ఉండాలని, అప్పుడే జన్మించే శిశువు ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. సూపర్ వైజర్ మారియమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ఆహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రత్న, మంజుల, లక్ష్మి, మోహన్ రాణి, పద్మ, మణెమ్మ, భారతి, ఆయా జయరత్న, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## మురుగునీటి సమస్య పరిష్కారం



తొట్టంబేడు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త: పెద్దకన్నలి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తకన్నలి ఆవాసంలో నీటిబోరు వద్ద చాలా రోజులుగా పేరుకుపోయిన మురుగునీటి సమస్యను పంచాయతీ అధికారులు గురువారం పరిష్కరించారు. డ్రైనేజీ నిలిచిపోవడంతో నీరు రోడ్డుపై నిలిచిపోయి దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ ఎంపీడీఓ గిరిధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది మురుగు నీటిని తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతం పరిశుభ్రంగా మారడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి సమస్యను పరిష్కరించడంలో టీడీపీ నేతలు మాజీ ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య, సుధాకర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హి సేవాలో భాగంగా హోమ్ కంపోస్టింగ్ పరిశీలన

### -తడి,పొడి చెత్త వేరు చేయాలి కమిషనర్ కృష్ణారెడ్డి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో హోమ్ కంపోస్టింగ్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు, రాజేశ్వరి గార్లు నిర్వహిస్తున్న హోమ్ కంపోస్టింగ్ ను కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని, చెత్తను కాలువల్లో, రోడ్లపై వేయవద్దని సూచించారు. ఇంటి నుండి వచ్చే తడి చెత్తతో హోమ్ కంపోస్టింగ్ చేయాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణాన్ని స్వచ్ఛ శ్రీకాళహస్తిగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవిప్రకాష్, అసిస్టెంట్ ఇంజనీర్ తేజస్విని, శానిటరీ ఇన్స్పెక్టర్లు దాము, సుధాకర్, పవన్, మోతిలాల్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త: 11రోజుల పాటు కుమారస్వామి తిప్ప మండపం వద్ద పూజలు అందుకున్న వినాయక నిమజ్జనం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా బయలుదేరింది. నిర్వాహకులు తెలుగుదేశం పార్టీకి చెందిన వంకాయల సిద్ధులయ్య పర్యవేక్షణలో 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం సాయంత్రం శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన హోమాలు, పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిమజ్జనానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్ కుమారస్వామి ఆలయ ఛైర్మన్ నెమళ్ళూరు బుజ్జి ఏర్పాట్లను సిద్ధులయ్యతోపాటు హరి, గుమ్మడిపూడి దశరధాచారిల పర్యవేక్షణలో నిమజ్జనం చేపట్టారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారాలను రప్పించారు. కోలాటాల బృందాలు, భజన బృందాలు, కులుకు భజనలు, కళాకారులు వందలాది మంది తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నిమజ్జనం సినిమావీధి, నగరివీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధిల మీదుగా సాగింది. ఉత్సవానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిఐ వెంకటేష్ వారి సిబ్బంది బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ఏపీఎస్‌ఆర్టీసీ కార్యాలయంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య




తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 24 ప్రభతవార్త: తాను చేయని తప్పుకి తనపై నింద వేశారనే, మనస్థాపంతో ఏపీఎస్ ఆర్టీసీలో మరో సంవత్సరంలో రిటైర్మెంట్ కాబోతున్న చీఫ్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ తిరుపతి డిపిటిఓ కార్యాలయంలో ఉరి వేసుకుని మరణించిన ఘటన గురువారం ఉదయం తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. ఈస్ట్ సిఐ శ్రీనివాసులు సమాచారం మేరకు వడమాలపేట మండలం, బీరువాని కండ్రిగ గ్రామానికి చెందిన సి.సుదర్శన్ వర్మ ఏపీఎస్‌ఆర్టీసీలో చీఫ్ సెక్యూరిటీగా ఇన్స్పెక్టరుగా విధులు నిర్వహిస్తూ జీవన సాగించేవారు. అయితే తన శాఖలో ఉద్యోగుల బదిలీలు సంబంధిత కార్యకలాపాలలో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణతో గత నెల సస్పెండ్ అయ్యారు. ఇదిలా ఉండగా వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిటైర్ కానున్న ఇన్స్పెక్టర్ తాను చేయని తప్పుకు పై అధికారులు బలి తీసుకున్నారని, అనేకమార్లు అధికారులకు వివరించిన తనపై సస్పెన్షన్ వేటను తీయలేదని తీవ్ర మనస్థాపానికి లోనయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం ఐదు గంటలకు తన ఇంటి నుండే చీరను తీసుకుని తిరుపతిలోని డిపిటిఓ కార్యాలయంలో తెచ్చుకున్న చీరతో ఉరి వేసుకుని మరణించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతుడు శరీరాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా హాస్పిటల్‌కి తరలించారు. అనంతరం ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 25 ఏళ్ల వేదాంత అనుభవానికి వేద విశ్వవిద్యాలయ పగ్గాలు

### -ఎస్వీ వేద వర్శిటీ ఉపకులపతిగా ఆచార్య కె. గణపతి భట్



తిరుపతి విద్య, సెప్టెంబర్ 24ప్రభాతవార్త : వేదాంత బోధనలో పాతికేళ్ల అనుభవం విద్యా పరిపాలనలో కీలక బాధ్యతలు వేదం, వేదాంతం, జ్యోతిషంలో పాండిత్యం, ఈ అనుభవాల సమాహారంతో ఆచార్య కె. గణపతి భట్ శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం పగ్గాలు చేపట్టనున్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అద్వైత వేదాంత విభాగం ఆచార్యుడిగా పనిచేస్తున్న ఆయనను వేద విశ్వవిద్యాలయ నూతన ఉపకులపతిగా నియమిస్తూ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులాధిపతి ఎస్. అబ్దుల్ నజీర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి మూడేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు.జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సుమారు 25 ఏళ్లుగా అద్వైత వేదాంత విభాగంలో బోధన సాగిస్తున్న గణపతి భట్ గతంలో అకడమిక్ డీన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. వేదం, వేదాంతం, జ్యోతిష రంగాల్లో పాండిత్యంతో పాటు ఉన్నత విద్యా వ్యవహారాల నిర్వహణలోనూ ఆయనకు అనుభవం ఉంది. దీంతో వేద విశ్వవిద్యాలయానికి విద్యా, పరిశోధనా రంగాల్లో ఆయన అనుభవం కీలకంగా మారనుంది.ప్రస్తుతం ఉపకులపతిగా ఉన్న డాక్టర్ రాణి సదాశివమూర్తి పదవీకాలం మరో పది రోజుల్లో ముగియనుంది. అనంతరం గణపతి భట్ కొత్త ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమె పదవీకాలంలో విశ్వవిద్యాలయాన్ని నడిపించిన తీరుపై అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు.నూతన ఉపకులపతి నియామకంపై విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. వేద, వేదాంత రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తికి బాధ్యతలు దక్కడంతో విశ్వవిద్యాలయ విద్యా, పరిశోధనా కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొంటూ గణపతి భట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.